క్లుప్తంగా

ఉల్లాసంగా హోలీ



మణికొండ: హోలీ పర్వదినాన్ని బుధవారమూ జరుపుకొన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ గోల్డెన్ ఓరియోల్‌లో చిన్నా, పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుని ఉల్లాసంగా, ఉత్సాహంగా సంబరాలను నిర్వహించారు. సంబరాల్లో గేటెడ్ కమ్యూనిటీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సిక్కుల ర్యాలీ

రాజేంద్రనగర్: హోలీ పండగను పురస్కరించుకొని సిక్ సోదరులు నిర్వహించే ర్యాలీ ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని గురుద్వారా నుంచి అత్తాపూర్ సిక్‌చావనీలోని గురుద్వారా వరకు ఈ ర్యాలీ సాగింది. సిక్కు సోదరులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ భక్తిగీతాలు పాడుతూ ముందుకు సాగారు. దారిపొడవునా సిక్ యువకులు, యువతులు కత్తి విన్యాసాలను ప్రదర్శించారు. ర్యాలీ నేపథ్యంలో అత్తాపూర్, రాజేంద్రనగర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి బందోస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కబ్జాకోరల్లో ఫుట్‌పాత్‌లు



బండ్లగూడ: మోడల్ మార్కెట్‌లో దుకాణాలు కేటాయించినా చిరు వ్యాపారులు తమ దుకాణాలను ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చిరువ్యాపారుల సౌకర్యార్థం అధికారులు కాళీమందిర్ ప్రాంతంలో భారీ మోడల్ మార్కెట్‌ను నిర్మించారు. టెండర్ల ద్వారా దుకాణాలను సైతం కేటాయించారు. దుకాణాలు వచ్చిన వ్యాపారులు ఇందులో షాపులను ఏర్పాటు చేయడం లేదు. రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయలు తదితర బండ్లను ఏర్పాటు చేస్తు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌ను ఉపయోగించే పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు ఉండటంతో ప్రధాన రహదారిలో నడిచే సమయంలో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓపెన్ జిమ్ కోసం వినతి

గచ్చిబౌలి: ప్రశాంతిహిల్స్, నాగాహిల్స్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ప్రశాంతి హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వినతిపత్రం అందించారు. అలాగే కాలనీ ప్రధాన ద్వారం నుంచి ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శేఖర్ రెడ్డి, ట్రెజరర్ జగదీష్, సభ్యులు విజయ్‌కరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణం సీజ్.. లైసెన్స్ రద్దు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ దుకాణాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నగేష్, జోనల్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ బాసిత్ తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సీజనల్ ఫ్రూట్స్ అంటూ అమీషా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట లైసెన్స్ తీసుకున్నారు. కానీ పోర్క్ విక్రయాలు, ఆన్‌లైన్‌లో విక్రయాలతో పాటు ఇతర వాటిని అక్రమంగా నిల్వ చేయడం, తయారు చేసిన వాటిని ఎప్పటి వరకు వినియోగించవచ్చో తెలిపే తేదీలు లేకపోవడంతో దీన్ని సీజ్ చేయడంతో పాటు లైసెన్స్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు జీహెచ్‌ఎంసీ అధికారులపై పరుష పదజాలానికి దిగడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్‌హిల్స్‌కాలనీలో ఆయన బుధవారం పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీ, బస్తీలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సీసీరోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్ వెంకటేష్, రాఘవేంద్ర, వరలక్ష్మి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, ప్రశాంత్ హిల్స్ కాలనీవాసులు పాల్గొన్నారు.

వనితా.. వందనం

ఘనంగా మహిళా దినోత్సవం

- వాడవాడలా సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్‌తో కలిసి కేక్‌కట్ చేస్తున్న మహిళలు



బండ్లగూడ మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్...



మణికొండ మున్సిపల్ కార్యాలయంలో మహిళలను సన్మానించిన కమిషనర్ ఫల్గుణకుమార్

రాజేంద్రనగర్ జోన్ బృందం: రాజేంద్రనగర్‌లో సర్కిల్ పరిధిలో మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు సంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు తదితర వాటిని నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్, అత్తాపూర్‌లో కార్పొరేటర్ మోంద్ర సంగీతగౌరీశంకర్, మైలార్‌దేవ్‌పల్లి టీఎస్‌ఆర్ గార్డెన్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో పాటు వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

డీసీపీ కార్యాలయంలో...

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డీసీపీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా పోలీసు సిబ్బందితో పాటు పోలీసు ఉద్యోగాల కోసం కోచింగ్ పొందుతున్న వారిని డీసీపీ నారాయణరెడ్డి సన్మానించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎ.శ్రీధర్‌కుమార్ మహిళా సిబ్బందిని సన్మానించారు.



రాజేంద్రనగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో మహిళా ఉద్యోగులతో పోలీసు ఉన్నతాధికారులు



నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ రేఖాయాదగిరి



పారిశుద్ధ్య కార్మికులతో పెండ్యాల సాయిమాలిక్



పీఎండీటీ కాలనీలో కార్పొరేటర్ పద్మావతి...



శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీధర్‌కుమార్



రాజేంద్రనగర్ మన్నాపూల్ గాస్పెల్ చర్చిలో ...



శివరాంపల్లి తలసేమియా కేంద్రంలో...



మహిళలను సన్మానిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

అన్ని రంగాల్లో మహిళల అసమాన ప్రతిభ



జాతీయ వ్యవసాయ విస్తరణ నిర్వహణ సంస్థలో..

ఏజీవర్సిటీ: ప్రస్తుతం అన్ని రంగాలలో భారతీయ మహిళలు అసమాన ప్రతిభను కనబరుస్తున్నారని ముఖ్యంగా ప్రపంచంలోనే భారత దేశంలో స్త్రీకి ప్రత్యేక గౌరవం ఉందని వ్యవసాయ విశ్వవిద్యాలం రిజిస్ట్రార్ సుధీర్ కుమార్, జాతీయ వ్యవసాయ విస్తరణ నిర్వహణ సంస్థ (మేనేజ్) డైరెక్టర్ జనరల్ చంద్రశేఖరన్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, మేనేజ్ విభాగంలోని మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఉద్యానవన విశ్వ విద్యాలయం వీసీ నీరజ ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

చెరిష్ హోం ఫర్ గర్ల్స్‌లో..



రాజేంద్రనగర్ పరిధి కిస్మత్‌పూర్‌లోని 'చెరిష్ హోం ఫర్ గర్ల్స్'లో క్వాలిటీ థాట్ సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

సవాళ్లను దీటుగా ఎదుర్కొంటేనే మహిళా సాధికారత

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి మమతా అనురాగ్‌శర్మ

మణికొండ: సమాజంలో ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ అన్ని రంగల్లో రాణిస్తేనే మహిళా సాధికారత సాధ్యమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి మమతా అనురాగ్ శర్మ, మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజాకిరణ్ పేర్కొన్నారు. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా గండిపేటలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలు అనేక రంగాలలో ఉన్నతంగా రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా వారు వారి మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, బసవతారకం ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కల్పనారఘునాథ్, కళాశాల కమిటీ కార్యవర్గ సభ్యులు ఉమాదేవి, దివ్యారెడ్డి, పద్మ, సంధ్యశ్రీ, క్రాంతి, శాలినీరెడ్డి, జయశ్రీ, డాక్టర్ ఝాన్సీబాయి, రమాబాయి తదితరులు పాల్గొన్నారు.



పెద్ద తాళ్లకుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా మహేష్



ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మహేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తు ఆదర్శంగా నిలవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పలుగుచెరువు మహేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మహేష్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా జరపాలన్నారు. యువతకు మహనీయుల గొప్పతనాన్ని తెలిపించేందుకు పాటుపడాలన్నారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాల్సినా తాము ముందుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ అర్చనజయప్రకాస్, డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, జాగృతి కన్వీనర్ రగడంపల్లి శ్రావణ్, అనుముల జాన్‌పాల్, మహిళా విభాగం అధ్యక్షుడు యాదమ్మ యాదవ్, తెప్ప అరుణ, సుమలత, మంజుల, ఝాన్సీ ఉమారెడ్డి, సయ్యద్ ముజామ్మిల్ అహ్మద్, రియాజ్, వీర్లపల్లి నవీన్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

12న ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ఎన్నికలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌కాలనీస్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఫెడరేషన్ ఎన్నికలను ఈ నెల 12వ తేదీ (ఆదివారం) నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు ఎం. సత్యనారాయణ మూర్తి, బీవీ సత్యనారాయణ తెలిపారు. గురు, శుక్రవారాలలో నామినేషన్లు దాఖలు, 11వ తేదీన ఉపసంహరణ, 12వ తేదీ ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం, అనంతరం ఎన్నికలను నిర్వహిస్తామని వారు వివరించారు. నామినేషన్లు, ఎన్నికలు హుడా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తామన్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పదవులతో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సంయుక్త కార్యదర్శులు, ఏడుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, కోశాధికారి, ఉప కోశాధికారి పోస్టుకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

మహిళాసాధికారతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రాజేంద్రనగర్: మహిళా శక్తి ఎంతో గొప్పదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కాటేదాన్‌లని టీఎల్‌ఎం గార్డెన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... మహిళా సాధికారితే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. మహిళలు తమ శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనా వేసుకోవద్దని సూచించారు. ఈ సాంకేతికను వినియోగించుకుంటూ మహిళలు మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలన కొనసాగిస్తూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. కేసీఆర్‌వి నోటిమాటలే తప్ప ఆచరణలో అసాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరుస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్, కొమురయ్య, మల్లారెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, తోకల సుధాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, జయానంద్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, తలారి చిన్న, ఉడుత లక్ష్మి, ధనలక్ష్మి, భారతమ్మ, కేదావరి, రజిత, మంగా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మణికొండ: జన్వాడ పెట్రోల్ పంపులో ముగ్గురు దాడి చేయటంతో మృతి చెందిన యువకుడు సంజయ్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నార్సింగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐ శివకుమార్‌ను కలిసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నిందితులు అధికార పార్టీ కార్యకర్తలు కావటంతో వారిపై పాతవి ఆరు కేసులున్నా నిర్భయంగా బయట తిరుగుతున్నారని ఆరోపించారు. మృతుడు సంజయ్ పనిచేసుకుని తల్లితండ్రులను పోషిస్తున్నాడని, అలాంటి వ్యక్తి కుటుంబానికి దూరం కావటం బాధాకరమన్నారు. అతని కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సూచించానన్నారు. అధికార పార్టీ నాయకులైనా నిందితులకు కొమ్ము కాయొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి కంజర్ల ప్రకాశ్, శంకర్‌పల్లి మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి